# కష్టారితం

## రజని

మా యింటి పక్కి యింట్లో ఓ ముసలాయన కొత్తగా దిగేడు. ఎవరో ఏమిటో నే నంతగా పట్టించుకోలేదు. అతను వీధి వరండాలో వాలుకుర్చీలో కూర్చొని మనవణ్నో ఎవర్నో ఆడిస్తూ ఉండడం మాత్రం రెండు రోజులు చూసేను. పక్కింటివాణ్ని పలకరించి తీరాలనే రూలును పాటించి మూడోరోజు సాయంత్రం ఆ ముసలాయన్ని పలకరించాను.

ఎవరు మీరూ అని అడిగేడాయన.

ఫలానా వాణ్ని పక్కింటి పెద్దమనిషినీ అని నేను చెప్పుకున్నాను.

అయితే దయచెయ్యం డన్నాడాయన, వీధిలోకో యింట్లోకో నాకర్థం కాలేదు. అలా నిల్చున్నాను. ఇంతలో "అమ్మి, కుర్చీ" అన్నాడతను. అంతలో ముప్ఫయ్యేళ్లావిడ- కూతురు కాబోలు - ఓ కుర్చీ తెచ్చి దబ్బున పడేసి చర్రున వెళ్ళిపోయింది. ఆవిడా ఆ మనవడూ, చీకటి మొఖాలవాళ్ళూ, వాళ్ళూ చీకట్లో కూడా బావులేరు. ఆ విషయం గమనిస్తూ ఉండిపోడంలో ఆవిడ తెచ్చిన కుర్చీకూడా బావులేకపోవడం గమనించలేదు. కూర్చోబోయి పడిపోబోయేను. పడిపోబోయి కాచుకున్నాను. నేను సరిగా కూర్చున్నాక "జాగ్రత్త కొంచెం చూసుకూర్చోండి. కుర్చీ బావులేదు. పడిపోగల్రు" అన్నాడాయన. పడిపోబోయేను కదండీ! కొంచెం గాభరా పడ్డాను. పడిపోగల ప్రమాదం ఉందని తెలియ జేసినందుకు ఆయనకి నా కృతజ్ఞత తెలియజేసుకొని "బావుందండీ మేష్టరుగారూ. బావుంది. ఆఁ బావుంది. ఎన్నాళ్ళయిందండీ దిగి" అని సంభాషణకి ఉపక్రమించేను. రెండ్రోజు లయిందన్నా డతను. "అవును రెండ్రోజులయింది. తెలుసును" అన్నాన్నేను. "ఆహాఁ" అన్నాడతను. "మనవడు అచ్చు మీలానే ఉన్నాడండీ" అన్నాన్నేను. "మనవడు కాడు కొడుకు" అన్నాడతను. ముసలిముండాకొడుక్కి ఆ కుర్చీ తెచ్చినావిడ రెండో పెళ్ళి పెళ్ళాం కాబోలని అనుకుంటున్నాను. ఇంతలో ఆ తల్లి మళ్లా ఒచ్చి "రారా వెధవా" అంది. పిలుపు వినగానే కాకిపిల్ల కాకిదగ్గరకి పోయింది. "తల్లంటే చూసేరా ఆ అభిమానం" అన్నాన్నేను. "తల్లికాదు, అక్క" అన్నాడతను. "అవునవును బావుంద"న్నాన్నేను. "పనేవైనా ఉందా" అన్నాడతను. "ఏంలేదు. ఇల్లు

చాలా బావుందీ" అన్నానేన్నను. "పెండికొద్దీ రొట్టె" అన్నాడతను. "బావుంది కానీ ఇంటివాడు దుర్మార్గపు ముండాకొడుకు సుమండీ, జాగ్రత్త" అన్నానేన్నను. "ఎవరన్నారలాగా?" అని అడిగేడతను. నాతో ఎవరన్నారో నాకు చచ్చినా గుర్తురాలేదు. "ఎవరో అనడం ఎందుకూ? ఇదివరకద్దెకున్నవాణ్ణి నానా పాట్లూ పెట్టి తగిలేసాడు కదా" అన్నానేన్నను. "వాడన్నాడా అలాగా" అని అడిగేడతను. అడిగిన వెంటనే వాలుకుర్చీలోంచి జువ్వలా లేచాడు. లేవగానే నాకు భయం వేసింది. "వాడేనా అన్నాడు?" అని గర్జించేడు ముసలాడు. ముసలాడలా గర్జించగలడని నే ననుకోలేదు. ఆ అరుపు వినగానే నా గుండెలు లటుక్కుమన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో నిరపరాధుల మీదికే తప్పులన్నీ తోసేయాలనే న్యాయసూత్రం మెరపు మెరిసిన కాలంలో గుర్తుకి తెచ్చుకొని "వాడేనండి రోజూ ఒచ్చి గోలగోల పెట్టేసేవాడు" అని కళ్లు మూసుకొని అబద్ధం ఆడేశాను. ఆ ముసలాడే దుర్మార్గపు ముండాకొడుకైన ఆ ఇంటివాడని వేరే నా కెవరూ చెప్పక్కర్లేదు కదామరి! అందుగురించి నా కేం అనుమానం లేకపోయింది. ఉన్న అనుమానం – ఏమైనా ఉంటే – ఆ ముసలాడా చీకట్లో మూడో కన్ను తెరిచి ఆ వరండాలో విలయతాండవం చేసి ఇదివరకద్దెకున్న వాణ్ణి 'అ' నించి 'క్ష' వరకూ అన్ని బూతులూ తిట్టి, హుంకరించి, ఘీంకరించి, ఘుర్ఘురించి నానాగోలా చేసి, అనుమానమంతా తీర్చేసేడు. ఆ యిల్లు ముసలాయన కష్టపడి చెమటోడ్చి సంపాదించిన రూపాయణాపైసల్తో స్వయంగా కట్టించుకున్న స్వంత ఇల్లుట.

అదీ మా ఇద్దరి స్నేహానికి ప్రారంభం! ఇద్దరికీ, మాకసలు ఘోరమైన దెబ్బలాట జరగవలసిందన్నమాట కాని నేను తప్పంతా అమాయకుడి మీద తోసేసి గమ్మున చక్కా కూర్చున్నాను. పక్కింటి పెద్దమనిషినని పరిచయం చేసుకున్న ప్రకారం పెద్దమనిషిలాగే ప్రవర్తించాను. మూటా ముల్లే కట్టుకొని గంపెడు సంసారాన్ని వెంటబెట్టుకొని బుర్రమీద కొంగు వేసుకొని ఇల్లు ఖాళీ చేసి పోయినవాణ్ణి తిట్టుకోడంతో నాకూ ముసలాయనకీ స్నేహం పెంపొందింది, వర్ధిల్లింది.

అప్పటికి ఆర్నెల్లక్రితం తన ఏభయ్యయిదో యేట ఆ ముసలాయన గవర్నమెంటు సర్వీసునుంచి రిటైరయ్యేట్ట. అతనికి అరవయేళ్లుంటాయి. కులద్వేషాన్ని పురస్కరించుకొని తాశిల్దారీతో అతనికి సరిపుచ్చేసేరుట. లేకపోతే అతను డిప్యూటి కలెక్టరుగా రిటైరవ్వలసిందట. పనిచేసినన్నాళ్లూ కష్టపడి చెమటోడ్చి పనిచేసేసేట్ట. కాని ఏంలాభం? "లాభంలేదు లాభంలేదండీ" అని నేనూ అనేవాణ్ని. ఆ ముసలాయన అచ్చు రిటైర్డు తాశిల్దారీలాగే ఉంటాడు. పండిన ఎర్రరంగు జుట్టు, చెక్కిన తిరగలి దిమ్మవంటి ముఖం, ముదిరిన ఆనబకాయవంటి పొట్ట, ఎదగడం బొత్తిగా మర్చిపోయిన కాళ్లూ చేతులూ – వీటన్నింటిలోనూ అతను అచ్చంగా రిటైర్డు రిచ్ గవర్నమెంటు సర్వెంటులాగే ఉంటాడు. అతగాడితో రోజూ నేను మాట్లాడి తెలుసుకున్న విషయం ఏమిటంటే అతను పుట్టిన క్షణం నుంచీ కూడా కష్టపడుతూనే ఉన్నాట్ట. చెమటోడుస్తూనే ఉన్నాట్ట.

అతను చెప్పే కబుర్లు నిజమైతే అతను చెరువులకొద్దీ చెమటోడ్చినట్టుగా మనం అనుకోవలసి ఉంటుంది. అతను కష్టపడ్డం నేనంతగా చూళ్ళేదు. కష్టపడ్డం అంటే వాలుకుర్చీలో కూర్చోడం అని నేనెప్పుడూ అనుకోలేదు. వాలుకుర్చీలో కూర్చుండీ కూడా అత నూరికే తెగ చెమటలు కక్కుతూ ఉండే వాడు. దాన్నిబట్టి తనకాలంలో అతను చాలా చెమటోడ్చుండాలని నేననుకున్నాను.

"కష్టేఫలే! అంత కష్టపడ్డందుకు పోనీ ఇప్పుడు సుఖపడుతున్నారు కదా" అన్నానోసారి.

"ఏదోనండి, ఇలా ఉన్నాను. దీన్ని సుఖం అంటారా? అయితే అనండి" అన్నాడాయన తువాల్తో చెమట తుడుచుకొంటూ, నిట్టూర్పు విడుస్తూ, వాలుకుర్చీలో కూర్చొని చల్లగాలి పీలుస్తూ. దుక్కముక్కలా ఉంటూ, చెప్పరాని బాధేదో పడుతున్నాడు. పాపం, అమాయకుడు, అనుకున్నాన్నేను.

కాని ఆ బాధేమిటో, ఆ కష్టం ఏమిటో నా ఊహకి అందలేదు. అతనికి ఓ కూతురూ ఇద్దరు కొడుకులూ మాత్రం ఉన్నారు. కూతురికి చవకరోజుల్లో పెళ్ళి చేసేడు. చిన్నకొడుకు చిన్నవాడు. ఆ బాలుడిగురించి ముసలాడికి పెద్ద బెడదేం లేదు. మరింక ఆ పెద్దకొడుక్కి కావలసిన కాలేజీలో సీటూ డిగ్రీ, నచ్చిన పిల్లా, అడిగిన కట్నం, కోరిన ఉద్యోగం దొరికేయట. మరింక తన భార్యకి కావలసిన దేముంది? పట్నవాసంలో పెద్ద ఇల్లుంది. ఇంటిపన్ను తక్కువ్వేయించుకొందికి మున్సిపాలిటీలో కావలసిన చుట్టాలున్నారు. ఇంటికి గాలీ, వెల్తురూ, కొళాయీ, దీపాలూ సదుపాయాలూ ఉన్నాయి. కాలు మీద కాలు వేసుక్కూర్చుందికి వరండాలో వాలుకుర్చీ ఉంది. ఓ రోజొచ్చినవాడు రెండో రోజు బైటాయించకుండా ఉండేందుకు వీలుగా విరిగీ విరగని కుర్చీ అతిథుల కోసం తయారుగా ఉంది. మరి అతగాడి బాధేమిటో నాకేం బోధపళ్ళేదు.

అతణ్ని చూసి నా స్నేహితుడొకడు "ఎవడ్రా? బలిసిన పందికొక్కులా ఉన్నాడూ" అన్నాడు. అది నీచోపమానం. నాకేం నచ్చలేదు. అతణ్ని చూస్తే నా కేం గుర్తుకొచ్చేదంటే, దుమ్ములకోసం కాళ్లీడ్చుకుంటూ, పెద్దపులి వెనకాతల తిరిగే ముసలి బక్కనక్క గుర్తు కొచ్చేది. అతను ముసలివాడే కాని నక్క కాదు, బక్క కాదు. అతణ్ని చూస్తే నాకు జాలివేసింది. కనికరం కలిగింది. పోనీ ఇప్పుడైనా సుఖపడుతున్నాడు కదా అనుకున్నాను. కాని అతని కేదో ఎందుకో రవంత భయం 'కుశింత బెంగా' లేకపోలేదు.

ఓసారి నేనో అర్జంటు పనిమీద చికాకోల్ వెళ్లి, అక్కడ నాలుగు రోజులుండి, అక్కడ పనేమీ కాకపోగా, చిరాకుపడి ఇంటికి తిరిగివచ్చి, చిక్కులన్నీ యధాతథంగా ఉండడంవల్ల ఎవరిమీదైనా ఎగరడానికి ఏదైనా నెపం దొరుకుతుందా అని చూస్తున్నాను. అంతలో మా యింట్లో అందరూ ఏకగ్రీవులై ఉత్సాహభరితులై నాకు వార్త చెప్పేరు. అదేమిటంటే, మా పక్కింటి ముసలాయనింట్లో రాత్రి దొంగలుపడి దోపిడీ చేసుకు

పోయేరట. ఆ వార్త వినగానే నా చిరాకంతా ఎగిరిపోయింది.

వెంటనే ముసలాయన్ని పరామర్శ చెయ్యడానికి ఉత్సాహంతో బయల్దేరి వెళ్లేను.

పాపం! ముసలాడు! ఏనుగులా ఉండేవాడు, పీనుగులా అయిపోయేడు. సీమపందిలా చక్కగా ఉండేవాడు, ఎడారి ఎలకలా బక్కచిక్కిపోయేడు. జీవచ్ఛవం, కొన ఊపిరి, కళ్ళల్లో ప్రాణం శల్యావశిష్టం. ఇలాంటి మాటలన్నీ నాకు గుర్తుకొచ్చేయి. వాటి భావం నా కప్పుడు బోధపడింది.

ఏదో సానుభూతి ప్రకటించేను. ఏపాటి పోయిందని అడిగేను.

వెయ్యిరూపాయిల్నగదూ, పత్తులాల బంగారం పోయేయిట-కష్టం మీద చెప్పేడు ముసలాయన. ఈసారి చెమట తుడుచు కోలేదాయన. అసలు, మనిషంతా ఆవిరై పోయేడు. అయినా, వెయ్యీ పదీ నాకేం పెద్ద సంఖ్యల్లా తోచలేదు. నాకేం సంతృప్తి లేకపోయింది. పక్కింట్లో దొంగలు పడ్డప్పుడు లక్షల్లక్షలు పోవాలి అది న్యాయం.

అంతేనా! పోన్లెండి అన్నాన్నేను.

"పోలీసువాళ్ళకి మరలాగే రిపోర్టిచ్చేను" అన్నాడు ముసలాయన.

నాకు బోధపల్లేదు. కాకపోతే మరెలా ఇస్తారు?

"అలా రిపోర్టివ్వకపోతే మరెలా ఇస్తారు?" అని అడిగేను.

"మరేం చెయ్యడం?" అన్నాడతగాడు.

ఏవిటేం చెయ్యడం? దేన్నేం చెయ్యడం? చెయ్యడం దేన్ని ఏవిటి? నాకేం అర్థంకాక అప్పుల్లా అభినయించి ప్రశ్న పరంపర కురిపించి నెమ్మదిగా కూపీ లాగేను.

నీతో కాకపోతే మరింకెవరితో చెప్పకోడం తమ్ముడూ. విను చెప్తానంతా అన్నాడు ముసలాయన. విన్నానంతాను.

అసలేవిటయిందిటంటేః

నగదు పోవడమేమో ఇరవై వేలదాకా నగదు పోయిందిట. బంగారమేమో నూరు తులాలపై చిలుకు బంగారం పోయిందిట. కొన్ని తులాల వెండి వస్తువులు పోయేయిట. చాలా ప్రోనోట్లు పోయేయిట. మరింక బట్టలూ, గిట్టలూ, చెప్పక్కర్లేదుట. దాదాపు సర్వనాశనం అయిందిట.

అమ్మయ్య అనుకొని "మరైతే పోలీసులకి రిపోర్టెందుకు స్వామీ అలా ఇచ్చేరూ?" అని కుతూహలపడి అడిగేను. ముసలాడు క్రుద్ధుడై పోయేడు. "అసలెంత పోయిందో చెప్తే నీ కదంతా ఎలా ఒచ్చిందని పీక పట్టుకోరటండీ పోలీసువాళ్లూ? పెద్ద వెధవ లేం చేసినా పరవాలేదు. మన్లాటి వాళ్ళం కడుపు కక్కుర్తికి నిన్నూనిన్నూ బక్కిరి బక్కిరి

పాతికరాళ్లు సంపాదిస్తే గెద్దలన్నీ చేరి పిచికలమీద ఆరోపణల్లా, వాటి గురించి విచారణల్లా, ఆపైన శిక్షలూను. దేశం ప్రభుత్వం, పాలనా అలా ఉన్నాయి బాబూ?. అంచేత అంతే పోయిందని రిపోర్టు రాసుకున్నాను. లేపోతే బేడీలు ముందు మనకీ; ఆ తరవాత దొరికితే ఆ దొంగవెధవలకీను" అనీ ముసలాడు ఒళ్లుమర్చి కేకలు వేసి, తెలివి తెచ్చుకొని తగ్గేడు.

ఓహో అదా సంగతీ అనుకున్నాను.

కడుపు కక్కుర్తివల్ల కష్టపడి బంగారు మేడ కట్టించేడు. కడుపు కక్కుర్తివల్ల తెక్కష్టపడి కొడుకు పెళ్ళికి పదివేలు కట్నం లాగేడు. కడుపు కక్కుర్తి వల్లనే కష్టపడి చెమటోడ్చి నిన్నూ నిన్నూ పీడించి పీడించి లంచాలు గుంజేడు.

బావుందిరా బాబూ అనుకున్నాను.

"ఎవరితోనూ చెప్పకు బాబూ? చెప్తే కొంపలంటుకుంటాయి. నీ పుణ్యం ఉంటుంది. ఎవరితోటి చెప్పకుస్మా! ఏదో బతకనీ నన్ను" అన్నాడు.

బతకనివ్వకపోతే ముసలాణ్ని చంపగల్నా?. సరే ఒస్తాను, అని కుంటికుర్చీలోంచి బైటపడి ఇంటికి పోబోతూ "ఇంట్లో కసలు దొంగెలా దూరేడూ" అని అడిగేను అనుమానం ఒచ్చి.

"చూద్దువుగాని రా" అన్నాడు. లోనికి వెళ్లేను. ఇనప్పెట్టెగదని ఓ గదుంది. అందులోకి తీసుకువెళ్ళేడు. ఆ గదికి ఓ వార ఓ కిటికీ ఉంది. ఆ కిటికీ ఇనపగజాలు బారుగా ఓ మనిషి దూరడానికి వీలుగా వంచేసి ఉన్నాయి. గదిలో ఓ మూల చీకట్లో మృగంలా ఉంది ఇనప్పెట్టె! ఇనప్పెట్టె ఇనప తలుపు కోసేసి ఉంది. ముసలి భర్తా, భార్యా డాబామీద పడుకున్నారుట. దిగువ ఈ ఘోరం జరిగిందట.

వంచగా వంగిన ఇనుప గజాల్నీ, కోసేయగా విరిగిన ఇనపతలుపునీ చూసి ఆ దొంగెవడో ఆ రాత్రల్లా అలా అంత కష్టపడి ఎంత చెమటోడ్చేడో అనుకున్నాన్నేను. అనుకొని ముసలాయన్నీ, ఇనప్పెట్టెనీ ఆ చీకటికొట్లో ఒదిలేసి వీధిలో కొచ్చేను. దొంగతనం ఎందుకు చేయరాదో ముసలాడికి ఇప్పటికీ అవగాహన కాలేదు; కాదు. అదంతే!

– విశ్వవీణ, (బహుశా 1950.)